క్లుప్తంగా

ఎండలో తిరగొద్దు



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

జగిత్యాలరూరల్: ఎండలు దంచికొడుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. సారంగాపూర్ మండలం అర్పపల్లిలో గుండెపోటు వచ్చిన వ్యక్తి ఇంటికి వెళ్లి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా రైతులు, ప్రజలు ఎండ తీవ్రత ఉన్నందునా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉదయం వేళల్లో, సాయంత్రం వేళల్లో పనులు చేసుకోవాలని సూచించారు.

ఇంటి వద్ద ఓటు వినియోగం



ఇంటివద్ద ఓటు వేస్తున్న వృద్ధురాలు

పెగడపల్లి: పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకోలేని 80 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు భారత ఎన్నికల సంఘం ఇంటి నుంచే ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తున్న విషయం విదితమే. ఈ మేరకు పెగడపల్లి మండలంలో మొత్తం ఇలాంటి వారు దివ్యాంగులు 40 మంది, 25 మంది వయోవృద్ధులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మండలంలో శనివారం ఆరు బృందాలు పర్యటించి వారి ఇళ్ల వద్దకెళ్లి ఓట్లు వేయించారు. 65 ఓట్లకు గానూ ఒకరు మృతి చెందగా, 64 మంది ఓట్లు ఇంటి నుంచి సేకరించినట్లు అధికారులు తెలిపారు. పంచాయతీ అధికారులు, బీఎల్‌వోలు, పోలీస్ సిబ్బంది పాల్గొని ఓట్లు వేయించారు.

కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ



ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న కమిషనర్

కోరుట్ల: పట్టణంలోని పారిశుద్ధ్య కార్మికులకు మున్సిపల్ ఆధ్వర్యంలో శనివారం ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎండలు తీవ్రంగా ఉన్నాయని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ బట్టు తిరుపతి కార్మికులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి



పెగడపల్లిలో బాలమృతం, గుడ్లు పంపిణీ

పెగడపల్లి: ఎండ తీవ్రత ఉన్నందునా పిల్లలను తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహేశ్వరి అన్నారు. మండల కేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్ దివస్‌లో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు చిన్నారుల ఎత్తులు కొలతలు చేసి బరువులు తూచారు. టీచర్లు బాలామృతం, గుడ్లు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెగడపల్లిలో సూపర్‌వైజర్ మాట్లాడుతూ ఎండదెబ్బ బారిన పడకుండా తీసుకునే పలు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీదేవి, సుజాత, భాగ్యమణి, వనజాత, రమ, హెల్పర్లు పాల్గొన్నారు.

ఎంఈవోకు నివాళి



నివాళి అర్పిస్తున్న పీఆర్టీయూ నాయకులు

జగిత్యాల: వెల్గటూర్ మండల విద్యాధికారి బత్తుల భూమయ్య ఎండదెబ్బ సోకి మృతిచెందగా ఆయన మృతదేహానికి పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, ఆనందరావు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన మృతి తీరనిలోటని, ఆయన సేవలు మరువలేనివన్నారు. వారి వెంట సంఘ నాయకులు జోగం శ్రీనివాస్, శేఖర్, కుమారస్వామి, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

అన్ని పార్టీల ప్రచారం ఉపాధి పనుల వద్దే



రేచపల్లిలో ఉపాధిహామీ కూలీల వద్ద ప్రచారం చేస్తున్న నాయకులు

సారంగాపూర్: ఉమ్మడి సారంగాపూర్ మండలంలో మూడు ప్రధాన పార్టీలు తమ ఎన్నికల ప్రచారాన్ని ఉపాధిహామీ పనుల వద్దే కేంద్రీకృతం చేస్తున్నాయి.పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ఈ నెల 13న జరగనుండడంతో ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మూడు పార్టీలు గ్రామాల వారిగా ఉపాధిహామీ కూలీలు పనులు నిర్వహిస్తున్న అటవీప్రాంతాలకు వెళ్లి ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ అభ్యర్థి టి. జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, బీజేపీ ప్రచారాన్ని రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి ఉపాధిహామీ కూలీలను కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఉదయం ఏడు గంటల వరకే ఉపాధిహామీ కూలీలు పనుల వద్దకు చేరుకోవడం, గ్రామాల్లో యాసంగి వ్యవసాయ పనులు ముగింపు దశకు రావడంతో జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబం ఉపాధిహామీ పనులకు వెలుతున్నారు. వేసవి తీవ్రత అధికంగా ఉండడంతో ఉదయం ఏడు గంటల నుండి 10 గంటల వరకు పనులు కూలీలు పనుల్లో పాల్గొంటున్నారు. పనిచేసిన కూలీకి రూ. 300 కూలీ వస్తుండడంతో పనుల్లో పాల్గొనేవారి సంఖ్య ప్రతి గ్రామంలో వందల్లో ఉంది. దీనితో పోటీలో ఉన్న వారి తరఫున ప్రచారం చేసే నాయకులకు ఒకే చోట వందల సంఖ్యలో ఓటర్లను కలిసే అవకాశం రావడం, అందులో ఎక్కువ మంది మహిళలు పనుల వద్ద ఉండడంతో పార్టీల నాయకులు వారిని కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

రుణమాఫీపై రేవంత్‌వి అబద్ధాలు

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

జగిత్యాల: రుణమాఫీ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డివి పూర్తి అబద్ధాలని, రైతుబంధు, రూ.500 బోనస్ ఎక్కడ అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో 12కు పైగా బీఆర్ఎస్ ఎంపీ స్థానాలు కైవసం చేసుకుంటాయన్నారు. గ్రామాల్లో వ్యవసాయ రంగాన్ని పండగ చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రేవంత్ ప్రభుత్వంలో వ్యవసాయ రంగంలో తేడాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఆరున్నర నెలల్లో రైతులకు చేసిన నష్టం వారికి తెలుసునన్నారు. 24 గంటల కరెంట్, సాగునీరు, రైతుబీమా ఇచ్చే పరిస్థితి లేదన్నారు.కల్యాణలక్ష్మితో పాటు, తులం బంగారం ఇస్తామని చెప్పినా ఇప్పటికీ అమలు లేవన్నారు. 50 వేల మెగా డీఎస్సీ ఏమైంది, 4 వేల నిరుద్యోగ భృతిపై నిరుద్యోగులకు సమాధానం చెప్పాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కయ్యారని ఆరోపించారు. పసుపు బోర్డుపై ఎంపీ అర్వింద్ బాండ్ పేపర్ రాసిచ్చి రైతులను మోసం చేశారన్నారు. తెలంగాణకు రావాల్సిన వాటా అడిగే దమ్ము, ధైర్యం బీఆర్ఎస్ ఎంపీలకు మాత్రమే ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రమణ, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ బాపురెడ్డి, గట్టు సతీశ్, మోర హన్మండ్లు, రాజేందర్‌రెడ్డి, రాంచందర్‌రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ప్రజలు ఆదరించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కృష్ణారావు

మల్లాపూర్: పేదల పార్టీ కాంగ్రెస్‌నే ప్రజలు ఆదరించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మండలంలోని సిరిపూర్, కొత్తదాం రాజుపల్లి గ్రామాల్లో శనివారం ఉపాధి హామీ కూలీల వద్ద కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్, బీజేపీల ఝూటా మాటలను నమ్మిమోస పోవద్దన్నారు. జీవన్‌రెడ్డికే ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్ల బాపురెడ్డి, గజ్జి గంగారెడ్డి, మండల నాయకులు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం శ్రీధర్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పని తెచ్చిందే కాంగ్రెస్ పార్టీ

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్, యూసుఫ్‌నగర్ గ్రామాల్లో ఉపాధిహామీ పనుల వద్ద కూలీలను కాంగ్రెస్ నాయకులు శనివారం ఓట్లు అభ్యర్థించారు. జీవన్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొంతం రాజం, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్ గౌడ్, ఎంపీటీసీ గుగ్గిళ్ల ప్రియాంక, సత్యం రావు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాసేవకు తపించే నాయకుడు జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం పరితపించే నాయకుడు జీవన్‌రెడ్డికి ఓటువేసి ఎంపీగా గెలిపించాలని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి కోరారు. పట్టణంలోని 25వ వార్డులో శనివారం కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ వంద రోజుల్లోనే ఇచ్చిన హామీలు అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, తోపారపు రాజేందర్, గుమ్ముల జనార్దన్, రఘు,ఆకుల నాగరాజు పాల్గొన్నారు.

జీవన్‌రెడ్డిని గెలిపించాలి

ఇబ్రహీంపట్నం: నిజామాబాద్ ఎంపీగా జీవన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు జీఎస్ వెంకట్ కోరారు. శనివారం మండలంలోని అమ్మక్కపేట, ఎర్రాపూర్ గ్రామాల్లో ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్,కొక్కు పురుషోత్తం, సునీత, మాజీ ఎంపీపీలు నెరేళ్ల దేవేందర్, పుష్పలత, ఎంపీటీసీ తిమ్మణి రాములు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




సమావేశమైన టీచర్లు, పూర్వ విద్యార్థులు

కథలాపూర్: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 2009–10 విద్యాసంవత్సరం పదోతరగతి పూర్తిచేసిన విద్యార్థుల సమావేశం శనివారం నిర్వహించారు. వారికి పాఠాలు చెప్పిన గురువులను ఆహ్వానించి వారిని శాలువాలతో సన్మానించారు. అనాటి జ్ఞాపకాలను విద్యార్థులు గుర్తుచేసుకొని సంబరాల్లో మునిగిపోయారు. సాయంత్రంవేళ సామూహికంగా భోజనాలు చేశారు.

గురువుకు సన్మానం

కొండగట్టు: మానకొండూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన 1974 బ్యాచ్ విద్యార్థులు గోల్డెన్ జూబ్లీ నిర్వహించుకోగా శనివారం పూడూర్‌లోని తమ గురువు పైడిపెల్లి రంగారావును తన స్వగృహంలో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గంప రాజేంద్రప్రసాద్,మడపతి నరేందర్‌రావు, రామయ్య ,విజయలక్ష్మి, భూమారెడ్డి పాల్గొన్నారు.

చెరుకు రైతుల కల నెరవేరబోతోంది



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మల్లాపూర్ : నిజాం షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ చర్యలు వేగవంతం కావడంతో చెరుకు రైతుల కల నెరవేరబోతోందని చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి అన్నారు. శనివారం షుగర్ ఫ్యాక్టరీ వద్ద చెరుకు రైతులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్, పొన్నం, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జువ్వాడి నర్సింగరావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బ్యాంకర్లతో వన్‌టైం సెటిల్‌మెంట్ ఒప్పందం చేసుకుని రూ.43 కోట్లు విడుదల చేయడం శుభపరిణామన్నారు. సీఎం ప్రకటించినట్లు సెప్టెంబర్ 17న మూతపడిన నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరుచుకుంటుందనే నమ్మకం కలిగిందన్నారు. కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్ కంది బుచ్చిరెడ్డి, చెరుకు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ న్యావనంది లింబాద్రి, చెరుకు రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో డీపీఎం తనిఖీ

మేడిపల్లి: మండలంలోని కమ్మరిపేట, ఒడ్యాడ్ గ్రామాల్లోని సెర్ప్ కేంద్రాలను శనివారం డీపీఎం విజయభారతి, మల్లేశం తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా రికార్డులను పరిశీలించారు. కొనుగోళ్లు పూర్తయిన ధాన్యం వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదుచేసి త్వరగా రైతులకు డబ్బులు పడేలా చూడలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం అశోక్, సీసీ రత్నాకర్, వీవోఏలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎడపెల్లిలో వైద్య శిబిరం

ధర్మపురి: పొలాస వైద్య కళాశాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మండలంలోని ఎడపెల్లిలో శనివారం వ్యవసాయ కళాశాలకు విద్యార్థులు వైద్య శిబిరం నిర్వహించి బీపీ, షుగర్ తదితర వ్యాధులు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల బృందం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శేషు, సత్యనారాయణ,ఎల్లాగౌడ్, రత్నాకర్, ప్రజ్ఞా, గ్రామస్తులు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చు

మెట్‌పల్లి: విద్యుత్ భద్రతా ప్రమాణాలను పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చని డీఈ తిరుపతి అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం విద్యుత్ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో కార్మికులు తప్పనిసరిగా హెల్మెట్, సేఫ్టీ బెల్ట్, ఎర్త్ డిశ్చార్జ్ రాడ్ వేసుకొని పనికి ఉపక్రమించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఈలు మనోహర్, శ్రీనివాస్‌రావు, ఏఈలు అమరేందర్‌రావు, వినీత్, సతీశ్, శివకుమార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

కోరుట్ల: పట్టణంలోని 28 వార్డులో బూత్ ఇన్‌చార్జి తులసి కృష్ణ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రధాని మోదీ పథకాలను వివరిస్తూ ధర్మపురి అరవింద్‌కు మరో సారి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ బీజేపీ ఇన్‌చార్జి వడ్డెపల్లి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు బింగి వెంకటేశ్, బెక్కం అశోక్, తునికి భాస్కర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న బీజేపీ ప్రచారం

కొండగట్టు: కరీంనగర్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌ను గెలిపించాలని శనివారం కొడిమ్యాల మండలం నాచుపెల్లిలో రాత్రి సమయంలో బీజేపీ కార్యకర్తలు, నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు.


బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

ఇబ్రహీంపట్నం: బాజిరెడ్డి గోవర్ధన్‌ను నిజామాబాద్ ఎంపీగా గెలిపించాలని మండలంలోని వర్షకొండ, బర్దీపూర్ గ్రామాల్లో శనివారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. బాజిరెడ్డి గోవర్ధన్ రాజకీయంలో అనుభవం ఉన్న వ్యక్తి అని, అందరికీ అందుబాటులో ఉంటారని, కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాగర్, తుక్కరం, నడిపి రాజన్న, లింగారెడ్డి, పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

మల్యాల: మండలంలోని మ్యాడంపల్లి లో ఉపాధి హామీ కూలీలకు కాంగ్రెస్ నాయకులు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ కు మద్దతుగా శనివారం మ్యాడం పల్లి లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వెలిచాల నిశాంత్ రావు, దిండు ప్రవీణ్, అమరేందర్ రెడ్డి, శ్రీధర్, సురేష్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు కౌన్సిలర్ల రాజీనామా



రాజీనామా లేఖలతో కౌన్సిలర్లు

జగిత్యాల: జగిత్యాల మున్సిపాలిటీకి చెందిన ఆరుగురు కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన చైర్‌పర్సన్ ఎన్నికలో వీరు పార్టీ సూచించిన వ్యక్తికి కాకుండా.. రెబల్‌కు సపోర్ట్ చేశారు. అప్పటినుంచి సైలెంట్‌గా ఉన్న వీరు తాజాగా బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

వారికి పార్టీతో సంబంధం లేదు

రాజీనామా చేసిన కౌన్సిలర్లకు బీఆర్ఎస్ పార్టీతో ఎలాంటి సంబంధమూ లేదని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు గట్టు సతీశ్ అన్నారు. బల్దియా చైర్‌పర్సన్ ఎన్నికలో విప్‌ను ధిక్కరించారని, రెబల్‌కు ఓటేసినప్పుడే తమతో బంధం తెగిపోయిందని పేర్కొన్నారు. కౌన్సిలర్లుగా వారి అనర్హత వేటు వేయాలని ఇప్పటికే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు.

నష్టపోయిన గీత కార్మికులను ఆదుకుంటాం

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



కాలిపోయిన వరి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లిరూరల్: నష్టపోయిన గీత కార్మికులను ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో అగ్ని ప్రమాదంలో కాలిపోయిన ఈత వనాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గౌడ సంఘానికి తక్షణ సాయం కింద రూ.50 వేలు అందజేశారు. స్థానిక ఎక్సైజ్ సీఐ వినోద్‌రాథోడ్‌కు ఫోన్ చేసి ఈత వనాలు దగ్ధమైన విషయం తెలియజేశారు. నష్టాన్ని అంచనా వేసి త్వరగా ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. గీత కార్మికులకు నష్టపరిహారం వచ్చేలా చూడాలన్నారు. అలాగే శ్రీనివాస్‌గౌడ్ అనే రైతు వరి పంట దగ్ధం కాగా ఆయనకు రూ.10 వేలు సాయం చేసి తహసీల్దార్‌కు శేఖర్‌కు సమాచారం ఇచ్చి నష్టపరిహారం వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట ఎంపీపీ సాయిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు జగన్‌గౌడ్, గౌడ కులస్తులు, రైతులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే బీజేపీ ధ్యేయం



సిరికొండలో ప్రచారం చేస్తున్న గోపాల్‌రెడ్డి

కథలాపూర్: రైతుల సంక్షేమం బీజేపీ ధ్యేయమని పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీని ఆదరించాలని కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి కోరారు. కథలాపూర్ మండలం సిరికొండలో శనివారం ఉపాధిహామీ పనుల వద్ద, ఆయా వాడల్లో తిరిగి ఎన్నికల ప్రచారం చేశారు. సుపరిపాలన అందించే బీజేపీకి ప్రజలు పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అల్గొట్ ప్రమోద్, కొడిపెల్లి అనిల్‌రెడ్డి, తెడ్డు మహేశ్, చిన్నరాజం, లింగేశ్వర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి: మండలంలోని ఒడ్యాడ్, కల్వకోట గ్రామాల్లో శనివారం వేములవాడ బీజేపీ కన్వీనర్ క్యాతం దశరథరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. ఉపాధి కూలీలను కలిసి బండి సంజయ్‌ని గెలిపించాలని కోరారు. అనంతరం మజ్జిగా ప్యాకెట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎన్‌రెడ్డి, కారండ్ల మదుకర్, తొగరి లక్ష్మిపతి, అన్నాడి జలపతిరెడ్డి, నాగెల్లి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

420 హామీలతో కాంగ్రెస్ గద్దెనెక్కింది



చిట్టాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

మల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ 420 హామీలతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిందని ఎమ్మెల్సీ రమణ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం మల్లాపూర్ మండలంలోని చిట్టాపూర్, సాతారం, మొగిలిపేట గ్రామాలతో పాటు మెట్‌పల్లి మండలంలోని వేంపేట గ్రామాల్లో నిర్వహించిన బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో వారు పాల్గొని మాట్లాడారు. రేవంత్ రెడ్డి ఝూటాకోర్ ముఖ్యమంత్రి అని, అమలుకు సాధ్యం కాని హామీలు, తప్పుడు వాగ్దానాలతో అధికారం చేపట్టి ప్రజలను వంచిస్తూ అబద్ధాలతో పాలన సాగిస్తున్నాడని దుయ్యబట్టారు.పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధిచెప్పి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి ఆశీర్వదించాలని, సేవకుడిగా పనిచేస్తారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, వైస్ ఎంపీపీ గౌరు నాగేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం



పొరండ్లలో ప్రచారం చేస్తున్న శ్రావణి

జగిత్యాలరూరల్: ఆరుగ్యారెంటీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి అన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలంలోని పొరండ్ల, కల్లెడ, మోరపల్లి గ్రామాల్లో, రాయికల్ పట్టణంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ఆరు గ్యారెంటీలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం నిరుపేద వర్గాలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో రూరల్ మండల అధ్యక్షుడు నలువాల తిరుపతి, జిల్లా కార్యదర్శి బొడ్డు పెద్దన్న, నాయకులు సుంకె దశరథరెడ్డి, ఇట్టెని రమేశ్, కొక్కు గణేశ్, కర్నె నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుల కష్టాలు తీర్చటంలో బీజేపీ, బీఆర్ఎస్ విఫలం



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

కోరుట్ల: గల్ఫ్ కార్మికుల కష్టాలు తీర్చటంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, గత బీఆర్ఎస్ ప్రభుత్వాలు విఫలం అయ్యాయని బాల్కొండ మాజీ ఎమ్మెల్యే ఈరవత్రిని అనిల్, కోరుట్ల సెగ్మెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు.పట్టణంలో శనివారం నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ గల్ఫ్ భరోసా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా 'గల్ఫ్ కార్మిక ద్రోహి గప్పాల అరవింద్‌పై ఖల్లివెల్లి చార్జిషీట్' పేరుతో పోస్టర్ విడుదల చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ గల్ఫ్‌లో ఉన్న కార్మికుల కోసం ఎంపీ గా ఉన్న అరవింద్ ఎలాంటి సహకారం అందించలేదని, గల్ఫ్ బాధితులను ఎన్నడూ కూడా పట్టించుకోలేదన్నారు. ప్రదాని నరేంద్ర మోదీ గల్ఫ్ వెళ్లినప్పుడు ఒక్కసారి కూడా కార్మికులను కలువలేదన్నారు. జీవన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, సత్యం రావు, కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు గంగాధర్ గౌడ్, రాజం, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటేష్ గౌడ్, సీఎస్ఆర్ అధినేత శ్రీనివాస్ రావు, గల్ఫ్ కార్మిక జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

స్పెషల్ కో ఆర్డినేటర్‌గా సుజిత్‌రావు

మెట్‌పల్లి: నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని జగిత్యాల, బాల్కొండ నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ స్పెషల్ కో ఆర్డినేటర్‌గా పీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావును సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించినట్లు వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించినా సీఎంకు సుజిత్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. రెండు నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు మెజార్టీ తీసుకరావడానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

కాంగ్రెస్ నేతలు ప్రచారం

కథలాపూర్: మండలంలోని చింతకుంట శివారులో ఉపాధిహామీ పనుల వద్ద కాంగ్రెస్ నాయకులు శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌పార్టీకి మద్దతుగా ఉండాలని కోరారు. కూలీలకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ డీసీసీ కార్యదర్శి చెదలు సత్యనారాయణ, నాయకులు కట్ట శంకర్, వంగ మహేశ్, తోట నరేశ్, పాల్గొన్నారు.